అనుమతి లేకుండా నిర్మించిన భవనం సీజ్

భవనాన్ని సీజ్ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

మంచిర్యాల టౌన్, మే 12. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రెడ్డి కాలనీలో ఎలాంటి అనుమతి లేకుండా నిర్మించిన భవనాన్ని సోమవారం టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు సీజ్ చేశారు. రెడ్డి కాలనీ ఏరియాలో సర్వే నంబర్ 199 లో కార్మూరి చంద్రమౌళి అనే వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా భవనాన్ని నిర్మించాడు. ఈ విషయంపై పలుమార్లు అధికారులు అతడిని వారించిన లెక్కచేయకుండా భవనాన్ని నిర్మించాడు. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు సోమవారం ఆ భవనం వద్దకు వెళ్లి భవనాన్ని సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. అక్కడ ఫ్లెక్సీని అమర్చారు. టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులలో మంచిర్యాల తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, పోలీసు శాఖ నుంచి ఏఎస్ఐ పాల్గొనగా మున్సిపల్ శాఖ టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి టీపీవో సంపత్, టీపీఎస్ శ్యాంసుందర్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి ఒకరి మృతి

మంచిర్యాల అర్బన్, మే 12: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హమాలీవాడ ఏరియాలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు మంచిర్యాల జీఆర్పీ ఎస్ఐ మహేందర్ తెలిపారు. సోమవారం వారు తెలిపిన వివరాల ప్రకారం మృతి చెందిన వ్యక్తి ఎత్తు 5 ఫీట్లు ఉంటాడని, తన కుడి చేతిపై హిందీలో జై గురుదేవ్, ఇంగ్లిషులో టోన్ అని పచ్చబొట్టు ఉన్నట్లు పేర్కొన్నారు. తన వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతికి గల కారణాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించి మార్చురీలో భద్రపరిచినట్లు, ఆచూకీ తెలిపిన వారు 9618689879, 8712658596 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కేబుల్ చోరీకి యత్నించిన ముగ్గురి అరెస్టు

జైపూర్, మే 12: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారంఖని 1ఏ చెక్‌పోస్టు ముందు ఉన్న బోరు రిపేరులో ఉండగా దానిని రిపేరు చేసేందుకు బోరు పైకి తీసి కేబుల్‌ను అక్కడే ఉంచారు. ఆ కేబుల్‌ను దొంగిలించడానికి యత్నించిన ముగ్గురు వ్యక్తులను సోమవారం సింగరేణి ఎస్అండ్‌పీసీ సిబ్బంది పట్టుకున్నారు. సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. ఐదు రోజుల క్రితం బోరుమోటరును రిపేరుకు తరలించగా అక్కడ ఉన్న కేబుల్‌ను ఇందారం గ్రామానికి చెందిన పులి భరద్వాజ్, బడుగు ప్రశాంత్, సొతుకు మల్లేశ్ దొంగిలించుకుపోయి ఓ చోట దాచిపెట్టినట్లు తెలిపారు. దానిని విక్రయించేందుకు యత్నిస్తుండగా వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వారిని జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వారిపై ఇప్పటికే స్క్రాప్ దొంగతనం కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి

నస్పూర్, మే 12 : ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల వేసవి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడుత ఈ నెల 13 నుంచి 17 వరకు ఉంటుందని, ఉపాధ్యాయులందరూ తప్పకుండా హాజరు కావాలన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. మొదటి విడుతలో శిక్షణకు 512 మంది ఉపాధ్యాయులు హాజరవుతారని తెలిపారు.

మట్టి రవాణాను అడ్డుకోవాలి

మందమర్రిరూరల్, మే 12 : మండలంలోని అందుగులపేట సమీపంలోని జాతీయ రహదారిని ఆనుకుని సాగుతున్న అక్రమ మట్టి దందాపై అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆసంపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మొరం వే బిల్లులు లేకుండా తరలించి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని శివకుమార్ కోరారు.

తునికాకు సేకరణకు వెళ్లి అస్వస్థతకు గురైన మహిళ

హాజీపూర్, మే 12 : మండలంలోని గఢ్‌పూర్ గ్రామానికి చెందిన సల్లం రాయపోసు సోమవారం ఉదయం సమీప అటవీ ప్రాంతానికి తునికాకు సేకరణకు వెళ్లింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తునికాకు సేకరణలో ఎండవేడికి అలసిపోయి ఒక్కసారిగా స్పృహ తప్పి కింద పడిపోయింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు రాయపోసును మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించారు.

అమర జవాన్ల త్యాగాలు మరువలేనివి

భీమారం, మే 12: దేశ రక్షణకు జరిగిన పోరాటంలో ప్రాణాలర్పించి అమర జవాన్ల త్యాగాలు మరువలేనివని భీమారం గ్రామానికి చెందిన యువత, గ్రామస్తులు పేర్కొన్నారు. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో నేపథ్యంలో వీరమరణం పొందిన అమరులకు నివాళులర్పించి మౌనం పాటించారు. అవుడం క్రాస్ నుంచి భారత సైనికులకు సంఘీభావ ర్యాలీ తీశారు. అంతకుముందు వర్తక వ్యాపారులు అన్ని దుకాణాలు మూసివేసి బంద్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోడెటి రవి, వేల్పుల శ్రీనివాస్, మెండె మల్లేశ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు

లక్షెట్టిపేట, మే 12: మున్సిపాలిటీ పరిధి లోని మోదెల రోడ్ లో శంఖ చక్రములు, పట్టే నామాలతో స్వయంభువుగా వెలిసిన లక్ష్మీ వేంకటేశ్వర స్వామి గుట్ట వద్ద నిర్వహించిన గిరి ప్రదక్షిణ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు సోమవారం పాల్గొని స్వామి కి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథ స్వామి ఆలయంలో..

మంచిర్యాల అర్బన్, మే 12: మంచిర్యాలలోని విశ్వనాథ స్వామి దేవస్థానం లో గల కన్యాకాపరమేశ్వర ఆలయంలోని శాకాంబరి అమ్మవారిని సోమవారం వివిధ రకాల కురగాయలతో అలంకరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, నాయకులు, భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

బీఆర్ఎస్ నాయకుల సేవా కార్యక్రమాలు

బెల్లంపల్లి, మే 12: తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ పుట్టిన రోజు వేడుకలను సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంద పడకల దవాఖానలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కూరగాయల మార్కెట్ కాంటా చౌరస్తా వద్ద బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాగం చరణ్, నల్లనాగరాజు, వంశీ, ప్రతాప్, ప్రణీత్, అఖిల్, చింటూ పాల్గొన్నారు. బీఆర్ఎస్ పట్టణ మైనార్టీ అధ్యక్షుడు అలీ ఆధ్వర్యంలో పలువురికి గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయులు ఖలీల్, అస్లాం, అన్వర్, వినయ్ పాల్గొన్నారు.

కార్మికులకు వాటర్ క్యాన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

చెన్నూర్, మే 12: చెన్నూర్ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులకు వోఆర్ఎస్ ప్యాకెట్లు, వాటర్ క్యాన్లను మున్సిపాలిటీ కమిషనర్ మురళీకృష్ణ సోమవారం పంపిణీ చేశారు. అనంతరం కార్మికులు పని చేస్తున్నప్పుడు వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను హెచ్చఈవో జగదీశ్ వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ శానిటరీ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, సిబ్బంది వెంకటేశ్, హరికాంత్ పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో సమస్యలు పరిష్కరించాలి

కాసిపేట, మే 12 : కాసిపేట మండలంలోని ముత్యంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ క్రీడా మైదానం కమిటీ అధ్యక్షులు బోయిని తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ భోజన్నకు వినతిపత్రం అందించారు. మైదానం చుట్టూ పెన్సింగ్, లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యంపల్లి క్రీడా మైదానం కమిటీ అధ్యక్షుడు బోయిని తిరుపతి యాదవ్, సభ్యులు సాయి, చిన్న, అశోక్, అజయ్, ఉమా కాంత్, రాజ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే 'ఆపరేషన్ చబుత్ర'

మందమర్రి, మే 12: నేరాల నియంత్రణకే ఆపరేషన్ చబుత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి కోరారు. ఆపరేషన్ చబుత్ర కార్యక్రమంలో భాగంగా ముగ్గురు ఎస్ఐలు, 25 మంది సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి పట్టణాన్ని అష్టదిగ్బంధం చేసి తనిఖీ చేశారు. రోడ్లపై అర్ధరాత్రి జులాయిగా తిరుగుతూ అనుమానాస్పదంగా ఉన్న 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. 18 బైకులు, ఒక కారు, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తుల పై కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ ఎస్.రాజశేఖర్, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, రామకృష్ణాపూర్ ఎస్ఐ జీ.రాజశేఖర్, మందమర్రి అదనపు ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

గూడెంలో ఘనంగా వైశాఖ పౌర్ణమి

దండేపల్లి, మే12: దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం వైశాఖ పౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. 303 జంటలు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

అటవీ అభివృద్ధి సంస్థ అధికారుల, సిబ్బంది రక్తదానం

మంచిర్యాల అర్బన్, మే 12: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ(టీజీఎఫ్‌డీసీ) అధికారులు, సిబ్బంది సోమవారం మంచిర్యాలలో రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. మంచిర్యాలలోని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖానలో రక్త నిధి కేంద్రంలో రక్తదానం చేశారు. ఈ నెల 5 నుంచి 14 వరకు అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు అటవీ అభివృద్ధి సంస్థ కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ శ్రావణి పేర్కొన్నారు. అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్ కుమార్, కాగజ్ నగర్ రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ ఎడ్ల లక్ష్మణ్, బెల్లంపల్లి రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ వీ. సునీతతో పాటు పలువురు ఫీల్డ్ సూపర్‌వైజర్లు, వాచర్లు , డ్రైవర్లు రక్తదానం చేశారు. వీరిని మంచిర్యాల రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జి, రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వాహకులు మధుసూదన్ రెడ్డి సన్మానించి, సర్టిఫికెట్లు అందజేశారు.

సులభ్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

మందమర్రి, మే 12: సింగరేణి మందమర్రి ఏరియాలోని బెల్లంపల్లి పట్టణంలో గల సులభ్ కాంప్లెక్స్‌లలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు రెండు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం ఏరియా సివిల్ ఎస్ఈ రాము నాయక్‌కు సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయు) నాయకులు వినతి పత్రం సమర్పించారు. సులభ్ కాంప్లెక్స్‌లను నిర్వహిస్తున్న సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ ఆర్గనైజేషన్ సంస్థ సూపర్ వైజర్‌ను వేతనాలు అడిగితే యాజమాన్యం బిల్లులు చేయడం లేదని అంటున్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు ఎండీ.జాఫర్, భూమయ్య, రాములు, మల్లన్న, శ్రీనివాస్, కనకయ్య, ఈశ్వరి, రాజేశ్వరి, శకుంతల, లక్ష్మి పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి- నలుగురిపై కేసు

బెల్లంపల్లి, మే 12 : బెల్లంపల్లి పట్టణంలోని అశోకనగర్ వద్ద ఆదివారం రాత్రి హెడ్ కానిస్టేబుల్ సతీశ్‌పై దాడి చేసిన నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భూపాలపల్లిలో హెడ్ కానిస్టేబుల్‌గా సతీశ్ తనబైక్‌పై కోడలు అద్వైతశ్రీ తో పట్టణంలోని అశోకనగర్‌లో ఓ కిరాణం దుకాణం వద్దకు వచ్చి బైక్‌ను పార్కింగ్ చేశారు. ఆ బైక్‌ను ఎండీ అజీమ్, రోహిత్, సుబ్బు, రోహిత్ కారుతో ఢీకొట్టారు. ఈ విషయంపై ప్రశ్నించిన సతీశ్‌పై యువకులు దాడి చేశారు. ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి హెడ్‌కానిస్టేబుల్‌ను దవాఖానకు తరలించారు. హెడ్‌కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

- మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే

అర్జీలు స్వీకరిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

దరఖాస్తులు స్వీకరిస్తున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నస్పూర్, మే 12 : ప్రజావాణి కార్యక్రమంలో అందిన అర్జీలు, దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తాండూర్, మంచిర్యాల, దండేపల్లి, హాజీపూర్, చెన్నూరు, బెల్లంపల్లి, లక్షెట్టిపేట, మందమర్రి, పులిమడుగు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అందిన ప్రతి దరఖాస్తునూ పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని తెలిపారు.

భూసమస్యలపై వినతుల స్వీకరణ

తాండూర్, మే 12 : తాండూర్ తహసీల్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ, మండల పరిషత్, పోలీసులు సంయుక్తంగా భూతగాదాల సమస్యల పరిష్కార వేదిక, ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణిలో సాధారణ సమస్యలపై 5 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.

అర్జీల పరిష్కారానికి కృషి చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, మే 12: ప్రజావాణిలో అర్జీల పరిష్కారానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- రాష్ట్ర మంత్రి సీతక్క

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

బెల్లంపల్లి, మే 12 : రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయలని రాష్ట్ర పంచాయతీ రాజ్ , మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ(సీతక్క) అన్నారు. సోమవారం బెల్లంపల్లి మండలంలోని చాకెపల్లిలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి ప్రారంభించారు. బెల్లంపల్లి పాత బస్టాండ్ నుంచి చాకెపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, ఎమ్మెల్సీ దండె విఠల్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రైతుల వినతి

వేమనపల్లి, మే 12 : పోడు వ్యవసాయం చేసుకుంటున్న నిరుపేద రైతులపై అటవీ అధికారులు అక్రమంగా కేసులు పెడుతున్నారని భూమి హక్కు పత్రాలను ఇవ్వాలని కోరుతూ సోమవారం బెల్లంపల్లికి వచ్చిన మంత్రి సీతక్కకు మండల మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్, నాయకులు వినతి పత్రం అందించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

రెబ్బెన, మే 12: మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. రెబ్బెన మండల కొమురవెల్లి గ్రామంలో సోమవారం కొమురవెల్లి నుంచి కిష్టాపూర్ వయా రంగాపూర్ వరకు రూ.2 కోట్లతో బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రూ.10 కోట్ల సీఆర్ఆర్ నిధులను జిల్లాలో రహదారుల నిర్మాణానికి కేటాయిస్తామని తెలిపారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తున్నామని, పనులు నాణ్యతగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎస్టీ కాలనీలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఏఎస్పీ చిత్తరంజన్, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు, అధికారులున్నారు.

కుమ్రం భీం విగ్రహం ఆవిష్కరించిన మంత్రి

చింతలమానేపల్లి, మే 12 : మండలంలోని డబ్బాలో కుమ్రం భీం విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోడు రైతుల సమస్యలు, రోడ్లకు అటవీ అనుమతుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆమె వెంట ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్, అదనపు కలెక్టర్ అధికారులు, నాయకులున్నారు.

సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానం అమలు

స్లాట్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్

హాజీపూర్, మే 12 : జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో భూముల క్రయ, విక్రయాలను జరిపే సమయంలో నూతనంగా స్లాట్ బుకింగ్ విధానాన్ని సోమవారం నుంచి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అమలు చేస్తుంది. అందులో భాగంగా మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అదనపు సబ్ రిజిస్ట్రార్‌ను నియమించింది. ఒక్కొక్క సబ్ రిజిస్ట్రార్‌కు 48 స్లాట్లను కేటాయించగా, ఒక్క రోజులో మొత్తం 96 రిజిస్ట్రేషన్లు జరుగనున్నాయి. కొనుగోలు, అమ్మకం దారులు స్లాట్ బుక్ చేసుకున్న సమయానికి కార్యాలయంలో అందుబాటులో లేకుంటే మరుసటి రోజుకు స్లాట్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. డాటా ఎంట్రీ సమయంలో తగిన జాగ్రత్తలను తీసుకొని వివరాలను నమోదు చేసుకోవాలి. స్లాట్ బుకింగ్ registration.telangana.gov.in వెబ్ సెట్‌లో నమోదు చేసుకోవాలి. స్లాట్ బుకింగ్ విధానాన్ని జిల్లా రిజిస్ట్రార్ రవీందర్ రావు సోమవారం పరిశీలించారు.

సింగరేణి సీఎండీకి పురస్కారం

గోదావరిఖని, మే 12: సింగరేణి విస్తరణ ప్రణాళికలతో సంస్థ ఉన్నతకి కృషి చేస్తున్న సీఎండీ ఎన్ బలరామ్‌కు ప్రతిష్టాత్మకమైన పర్ఫామెన్స్ ఎక్సలెన్స్ పురస్కారం లభించింది. ఈ మేరకు ఆదివారం మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో జరిగిన 25వ జాతీయ స్థాయి ముఖ్య కార్యనిర్వహణ అధికారుల సమావేశంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సీఎండీ కృషికి గానూ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ (ఐఐఐఈ) పురస్కారం ప్రకటించారు. సీఎండీ తరపున అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్, ఐఐఐఈ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు భాస్కర్ స్వీకరించారు. పురస్కారాన్ని సోమవారం సింగరేణి భవన్‌లో సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్‌డీఎం సుభానీ, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ భాస్కర్ సీఎండీకి అందజేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో వన్య ప్రాణులకు హాని

జైపూర్, మే 12: అడవుల్లో పారేసిన ప్లాస్టిక్ వ్యర్థాలతో వన్యప్రాణులకు హాని కలుగుతుందని అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి పేర్కొన్నారు. అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం జైపూర్ మండలంలోని కాన్కూర్ అటవీ శివారు లోని నీలగిరి ప్లాంటేషన్‌లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని సిబ్బందితో కలిసి నిర్వహించారు. అటవీ ప్రాంతంలో మద్యం సీసాలు, ప్లాస్టిక్ కవర్లు పారేసి వన్యప్రాణులకు హాని కలిగించవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల మేనేజర్ గోగు సురేశ్‌కుమార్, కాగజ్‌నగర్ రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ ఎడ్ల లక్ష్మణ్, బెల్లంపల్లి ప్లాంటేషన్ మేనేజర్ సునీతతో పాటు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి : జేఏసీ

మాట్లాడుతున్న సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

సీసీసీ నస్పూర్, మే 12ః కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, సీఐటీయూ నాయకులు నాగరాజుగోపాల్, ఐఎఫ్‌టీయూ నాయకులు విశ్వనాథ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, పారిశ్రామిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ఒక్కరోజు టోకెన్ సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమ్మె కోసం ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాలు జేఏసీగా ఏర్పడినట్లు చెప్పారు. 44 ఉన్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం 29 చట్టాలకు మార్చి వాటిని 4కోడ్‌లుగా విభజిస్తుండడంతో కార్మికులు అనేక హక్కులు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికుల హక్కులు, సమస్యలపై డిమాండ్లు ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు కందికట్ల వీరభద్రయ్య, బాజీసైదా, గరిగె స్వామి, పెట్టం లక్ష్మణ్, పొగాకు రమేశ్, బాలాజీ, కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి డైరెక్టర్ పర్యటన

ఖైర్‌గూడ ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

రెబ్బెన, మే 12: బెల్లంపల్లి ఏరియా లో సోమవారం సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్టులు, పా) వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్ రెడ్డితో కలిసి పర్యటించినట్లు ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. ఏరియా లోని గోలేటి సీహెచ్‌పీ, ఖైర్‌గూడ ఓసీపీని సందర్శించారు. అనంతరం గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏరియా ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి, పీవో మచ్చగిరి నరేందర్, సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, సివిల్ అధికారి మదీన బాషా, పీఈ వీరన్న, సీహెచ్‌పీ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, గని మేనేజర్ శంకర్ లతో పాటు ఏరియా లోని ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా నర్సుల దినోత్సవం

కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న నర్సులు, ఐఆర్‌సీఎస్ సిబ్బంది

మంచిర్యాల అర్బన్, మే 12: అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్త నిధి కేంద్రంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. రక్తనిధి కేంద్రంలో సేవలందిస్తున్న సిబ్బంది రజిత, లావణ్య, శిరీష, సత్యవతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సీఎస్ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ చెందూరి మహేందర్, స్టేట్ ఎంసీ మెంబర్ మధుసూదన్ రెడ్డి, కమిటీ సభ్యులు ఎడ్ల కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటపల్లి, మే 12 : కోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారిణి అరుణశ్రీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్కే 8 డిస్పెన్సరీలో..

శ్రీరాంపూర్, మే 12 : శ్రీరాంపూర్ ఆర్కే 8 డిస్పెన్సరీలో సోమవారం నర్సుల దినోత్సవం సందర్భంగా డీవైసీఎంవో రమేశ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవంలో జీఎం ఎం శ్రీనివాస్ పాల్గొని ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళా ఉద్యోగులకు జీఎం బహుమతుల అందించారు. అనంతరం ఉత్తమ స్టాఫ్ నర్సులుగా ఎంపికైన ధనలక్ష్మీ, నాగమణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ బాజీసైదా, డీవైజీఎం అరవిందరావు, డాక్టర్ మురళీధర్, పిట్ కార్యదర్శి విజయలక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బూరేపల్లిలో ప్రాణహిత నది వద్ద సర్వే

చింతలమానేపల్లి, మే 12 : బూరేపల్లి వద్ద ప్రాణహిత నది వద్ద బ్యారేజీ నిర్మాణం కోసం అధికారులు సర్వే చేపట్టారు. రిటైర్డ్ ఇంజనీర్ విఠల్‌రావుకి చెందిన ఎస్వీ కన్సల్టెన్సీ సంస్థ సర్వే పనులు మొదలుపెట్టింది. కౌటాల మండల తుమ్మిడిహెట్టి నుంచి చింతల మానేపల్లి మండలం బూరేపల్లి దిగువ వరకు పలు కేంద్రాల్లో సర్వే చేస్తోంది. రిటైర్డ్ ఇంజినీర్ విఠల్‌రావు ఆధ్వర్యంలో మొదలైన ఈ సర్వేకు ఇరిగేషన్ అధికారులు సహకారం అందిస్తున్నారు. ఇటు తెలంగాణ అటు మహారాష్ట్రలోని భూభాగంలో సర్వే చేస్తున్నారు. నది వెడల్పు, స్వభావం, స్థితి, లాంగిట్యూడ్, లాటిట్యూడ్, లోతుకి సంబంధించి వివరాలు నమోదు చేస్తున్నారు. తుమ్మిడి హెట్టి నుంచి దిగువన ఉన్న రణవెల్లి, బూరేపల్లి నుంచి కోర్సిని సమీపం వరకు సర్వే చేస్తున్నారు. దీని కోసం ఇద్దరు ఇంజినీర్లతో పాటు వీరికి సహకారంగా ఇరిగేషన్ ఏఈ ఉన్నారు. మహారాష్ట్రలో సైతం ఉన్న ఊర్లు, అడవి, అక్కడి భూములు సాగు చేస్తున్న వాటి వివరాలు ఆరా తీసి నోట్ చేసుకుంటున్నారు. నది వెడల్పు గరిష్టంగా కిలోమీటర్ 600 వరకు ఉండగా కొన్ని చోట్ల కిలోమీటర్ వరకు ఉన్నట్లు గుర్తించారు.నదిలో మూల మలుపులు కూడా ఉన్న ప్రదేశాలను గుర్తించారు.

తునికాకు సేకరణ ప్రారంభం

బెజ్జూర్, మే 12 : మండలంలోని కుకుడ, అంబాగట్, బూరుగూడ, కాటెపల్లి, ముంజంపల్లి , పోతెపల్లి, బారెగూడ తదితర గ్రామాల్లో సోమవారం తునికాకు సేకరణ ప్రారంభించారు. 50 ఆకుల కట్ట ధర 3.30 పైసలు కూలీలకు చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో కూలీలు తెల్లవారు జాము నుంచి కూలీలు ఎడ్లంబండ్లతో, కాలినడకతోను అటవీప్రాంతాలకు వెళ్లి తునికాకును సేకరించి ముల్లెలను నెత్తిన పెట్టుకొని ఉదయం 10 గంటలక వరకు ఇండ్లకు చేరుకున్నారు. అనంతరం పగలంతా ఆకులను మడత పెట్టి కట్టలు కట్టుకొని కళ్లాలకు తీసుకెళ్లి కళ్లేదారుకు రాత్రి వరకు విక్రయించారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, మే 12: ఇటీవల అడవి పంది దాడిలో గాయపడిన ఆదివాసీ కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం ప్రభుత్వ దవాఖానలో కిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. కౌటగూడాలో త నెల 29 న అడవి పంది దాడిలో గాయపడిన రాజు బాయి, రవి, ప్రేమలత కుటుంబసభ్యులతో కలిసి కలెక్టర్ విన్నవించినా ఎలాంటి సహాయం అందకపోవడం బాధాకరమన్నారు. అటవీశాఖ అధికారులు కూడా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవై ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెడెం టికానంద్, గోడిసెల కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

రెబ్బెన, మే 12: రెబ్బెన మండలంలోని కొమురవెల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే కు సోమవారం కొమురవెల్లి గ్రామానికి చెందిన రైతులు వినతిపత్రం అందించారు. ఇక్కడ కేంద్రం లేక నారాయణపూర్‌కు వెళ్లి విక్రయించేందుకు ఇబ్బంది పడుతున్నామని తెలిపారు.

కుష్టు నివారణకు కృషి చేయాలి

కౌటాల, మే 12 : కుష్టు వ్యాధి రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ అధికారి వెంకటేశ్వ రాచారి అన్నారు. సోమవారం సిర్పూర్ (టీ) మండలం లోనవెల్లి పీహెచ్‌సీని ఆయన రాష్ట్ర బృందంతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి నివారణపై ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. వ్యాధి ప్రారంభ దశలోనే గుర్తించి నివారణపై అవగాహన కల్పించాలన్నారు. ఎండీటీ మాత్రలతో వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బృందం సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, అరుణ, సురేందర్, వైద్యాధికారిని నవత, సిబ్బంది నర్సయ్య, సునీత, పద్మావతి పాల్గొన్నారు

రక్తదాతలకు ప్రశంసా పత్రాల అందజేత

వాంకిడి, మే12 : బుద్ధ జయంతి, అంబేద్కర్ జయంతి సందర్భంగా రక్తదానం చేసిన సిద్ధార్థ యువజన మండలి సభ్యులు 22 మందికి సోమవారం బౌద్ధ సంఘం నాయకులు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక దళ్ జిల్లా బాధ్యులు దుర్గం సందీప్,అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ల విడుదల

కౌటాల, మే 12 : దేశ వ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మె పోస్టర్లను సోమవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెలిశాల కృష్ణామాచారి నాయకులతో కలిసి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షకులపై చేస్తున్న కక్ష సాధింపు చర్యలకు నిరసనగా ఈ నెల 20న దేశ వ్యాప్త సమ్మె చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట జిల్లా నాయకుడు మోరేశ్వర్, మండల కన్వీనర్ మోర్లె నాగేశ్‌తో పాటు మండలంలోని పంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మేకపిల్లలు మృతి

రెబ్బెన, మే 12: మండలంలో పుంజుమేరగూడలో సోమవారం కుక్కల దాడిలో ఆరు మేక పిల్లలు మృతి చెందాయి. ఇంటి ఆవరణలో ఉన్న దొడ్డిలోని మేక పిల్లలపై కుక్కలు దాడి చేయగా తీవ్రగాయాలతో మృతి చెందాయని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని యజమాని గోపిచంద్ కోరాడు.

ఉద్యోగోన్నతులతో బాధ్యతలు పెరుగుతాయి

మంచిర్యాల అర్బన్, మే 12: పోలీస్ శాఖలో ప్రమోషన్లతో పాటు మరిన్ని బాధ్యతలు కూడా పెరుగుతాయని రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న పలువురు సిబ్బందికి ఎస్ఐలుగా ప్రమోషన్ పొందారు. ఈ సందర్భంగా సోమవారం సీపీ వారిని అభినందించి ర్యాంక్ చిహ్నాలను అందజేశారు. పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా నిర్వహిస్తూ ప్రజలకు పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని సీపీ సూచించారు.

ఎస్టీపీపీలో సీఐఎస్ఎఫ్ మాక్‌డ్రిల్

జైపూర్, మే 12: భారత్ పాకిస్తాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసుల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ పౌరులను అప్రమత్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎస్టీపీపీలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించగా మంచిర్యాల డీసీపీ భాస్కర్ రావు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి ఎస్టీపీపీని సందర్శించారు. కొత్త వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. గుర్తింపు కార్డు తనిఖీలు నిర్వహించాకే ప్లాంటు లోపలికి అనుమతించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐ రామకృష్ణతో పాటు సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులను వదిలి వైద్య సిబ్బంది నృత్యాలు !

మంచిర్యాల అర్బన్, మే 12: చెన్నూర్ ప్రభుత్వ దవాఖానలో సోమవారం నిర్వహించిన నర్సుల దినోత్సవంలో వైద్య సిబ్బంది దవాఖాన సూపరిండెంట్ సత్యనారాయణ చేసిన నృత్యాలు వివాదాస్పదమయ్యాయి. దవాఖానలో రోగులుండగా సినిమా పాటలపై నృత్యాలు చేస్తూ ఇబ్బంది కలిగించారని విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.